క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


క్రోసూరు: మండలంలోని ఊటుకూరు 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ బసవరాజు బుధవారం తెలిపారు. ఊటుకూరు సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పనుల దృష్ట్యా సబ్‌స్టేషన్ పరిధిలోని విప్పర్ల, ఊటుకూరు, బయ్యవరం, బాలెమర్రు గ్రామాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

జాన్సన్‌కు ఉత్తమ సేవా పురస్కారం



సత్తెనపల్లి: మండలంలోని గుడిపూడి గ్రామంలో సత్తెనపల్లి ఉషోదయ కళా పరిషత్ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా హెడ్ క్యాషియర్ చిలుకా జాన్సన్‌కు ఉత్తమ సేవా పురస్కారం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఉషోదయ కళా పరిషత్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, న్యాయవాది గంగూరి అజయ్ కుమార్, నాయకులు చిలుకా శ్యామ్, చిలకా రమణయ్య, ఉపాధ్యాయుడు హిట్లర్, తదితరులు ఉన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తిరునాళ్ల



రాజుపాలెం: మండలంలోని అనుపాలెం గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముత్యాలమ్మ తిరునాళ్లను మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు ముత్యాలమ్మ తల్లికి పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకుని, చీర సారె సమర్పించారు. గ్రామంలోని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం తిరునాళ్లలో ఏర్పాటు చేసిన ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ వేణుగోపాల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీరువా, కుర్చీలు అందజేత



పెదకూరపాడు: పెదకూరపాడు జెడ్పీ పాఠశాలకు కొన్నిపాటి వెంకట గంగాధరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి భారతి సంక్రాంతి పండగ పురస్కరించుకొని పాఠశాలకు బీరువా, కుర్చీలు, కళావేదికపై మ్యాట్, కర్టన్లు అందించారు. ఈ సందర్భంగా 1989–90 బ్యాచ్ కృష్ణమనేని లలిత బాబు సహకారంతో పమిడాల వెంకటరావు, కరణం వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసు, శ్రీరామినేని సుధీర్, ఉన్నవ సాయి, దుప్పటి వెంకటేశ్వర్లు ఈ సామగ్రిని అందించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఉత్తమ హోంగార్డుగా సుభాని



ముప్పాళ్ళ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎస్.సుభాని జిల్లా ఉత్తమ హోంగార్డుగా ఎంపికయ్యారు. ఆ మేర నరసరావుపేటలోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. హోంగార్డు సుభాని గత 20 సంవత్సరాలుగా మంచినీటి చలివేంద్రం నిర్వహణతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. దీంతో పాటుగా విధి నిర్వహణపై బాధ్యతా యుతంగా పనిచేస్తున్నందుకు గాను అభినందిస్తూ అవార్డు అందించారు. ఈ సందర్భంగా సుభానిని ఎస్సై యు.సోమేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

చలి కాలం.. వ్యాధుల కాలం

- మారిన వాతావరణంతో పొంచి ఉన్న ముప్పు
- ముందు జాగ్రత్తలే మేలంటున్న వైద్యులు

రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోయి చల్లని వాతావరణం పెరుగుతోంది. ఒక్కసారిగా వచ్చిన మార్పులకు వ్యాధుల భయం వెంటాడుతోంది. చిన్నారులు, వృద్ధులు చర్మ, శ్వాస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. శీతాకాలం అంటే వైరల్, బ్యాక్టీరియా జ్వరాలు ఎక్కువగా వ్యాపించే సమయం. అప్రమత్తంగా లేకపోతే రోగాల బారిన పడే అవకాశం ఉంది. అయితే ఈ సీజన్‌లో వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో ఒక ప్రభుత్వ ఏరియా వైద్యశాల, ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులకు చలి గాలుల తీవ్రత పెరిగింది. నవంబర్ నెల ముగింపు నుంచి జనవరి నెల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నిత్యం జ్వరం, ఇతర రుగ్మతలతో బాధ పడుతున్న వారు వైద్య కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. అయితే ఇటీవల కాలంలో ఈ సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. ఈ సమయంలో చిన్నారులు, వృద్ధులు, రోగుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని.. జలుబు, దగ్గు, అలర్జీ, ఆస్తమా తదితర వ్యాధులు ఈ సీజన్‌లో విజృంభిస్తాయని వైద్యులు చెబుతున్నారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందని.. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఇవి తప్పనిసరి

- పిల్లలు, వృద్ధుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వారు అప్రమత్తంగా ఉండాలి.
- రోజూ తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి.
- బయటకు వెళ్లాల్సి వస్తే చర్మాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి.
- చలి ఎక్కువగా ఉంది అని అతి వేడిగా ఉన్న నీటితో స్నానం చేయడం మంచిది కాదు. స్నానానికి గోరువెచ్చని నీటిని మాత్రమే ఉపయోగించాలి. రాత్రి పడుకునే ముందు చర్మానికి అవసరమైన మాయిశ్చరైజర్లు రాసుకుంటే మంచిది.
- రోజు వ్యాయామం చేయాలి. తద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- దగ్గడం, తుమ్మడం లాంటివి చేసేటప్పుడు నోటికి చేతి రుమాలును అడ్డుగా పెట్టుకోవాలి.



సత్తెనపల్లిలో ఉదయం 7.30 గంటలకు కూడా వీడని మంచు

పెరుగుతున్న రహదారి ప్రమాదాలు

మంచు కురుస్తున్న సమయంలో ఉదయం నడకకు వెళ్లేవారు, ఆటలు ఆడుకునే వాళ్లకు ఆస్తమా వచ్చే అవకాశం ఉంది. ఈ సమయంలో ప్రమాద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే శీతాకాలంలో పైకప్పు ఉండే ప్రదేశాలలో నడక ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. మంచు కురుస్తున్న సమయంలో నడకకు వెళ్లిన వారు వాహన ప్రమాదాలకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. పలువురు మృత్యువాత పడగా, మరి కొంతమంది తీవ్ర గాయాల పాలైన వారు కూడా ఉన్నారు. వాహనాలు కూడా అదుపు తప్పిన ఘటనలు ఉన్నాయి. మంచు తీవ్రత తగ్గిన తర్వాత వాహన రాకపోకలు సాగించాలని వైద్యులు సూచిస్తున్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

తెలుగువారి అతిపెద్ద పండగైన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు కళకళలాడగా.. పిండి వంటలు ఘుమ ఘుమలాడగా.. బంధుమిత్రులు సందడి చేశారు. సంక్రాంతి సందర్భంగా మంగళవారం ఉదయం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆ తర్వాత ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బుధవారం కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఉల్లాసంగా పట్టణం, పల్లెల్లో వేడుకలు

సత్తెనపల్లి: నియోజకవర్గంలో సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించారు. భోగితో ప్రారంభమైన ఆనందోత్సాహాలు రెండు, మూడవ రోజు అయిన సంక్రాంతి, కనుమల్లో వెల్లివిరిశాయి. పట్టణం, పల్లెల్లో ప్రతి ఇల్లు బంధుమిత్రులతో కళకళ లాడాయి. పలుచోట్ల మంగళవారం ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం పెద్దలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలోచింపజేసిన ముగ్గులు

సంక్రాంతి పండగ వేళ ప్రతి ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేయడం ఆనవాయితీ. అయితే సమాజాన్ని జాగృతం చేసేలా పట్టణంలోని పలు వీధుల్లో ఇళ్ల ముందు బాలికలు, మహిళలు ముగ్గులు వేశారు. సంక్రాంతి శోభ, పలు సందేశాలతో కూడిన ముగ్గులు వేశారు.

కోలాహలంగా కనుమ

కనుమ పండగను సంప్రదాయబద్ధంగా కోలాహలంగా నిర్వహించారు. గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు పలు గ్రామాల్లో పోటీలు నిర్వహించారు. ఆవులను అలంకరించి పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో పాటు ఇతర మతాలకు చెందిన సన్నిహితులు, మిత్రులను కూడా కనుమ నాడు విందు భోజనానికి ఆహ్వానించారు. రాత్రి వరకు పలు ముచ్చట్లతో ఆనందంగా గడిపారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే మాంసం దుకాణాలు, చికెన్ దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. కొన్ని చోట్ల మహిళలు పేరంటాలు నిర్వహించారు.



సత్తెనపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

ఘనంగా సంక్రాంతి వేడుకలు

పెదకూరపాడు: సంక్రాంతి వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పెదకూరపాడులో నడ్డిగడ్డ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అమరావతి మండలంలోని మల్లాది గ్రామంలో వరసగా పదో సంవత్సరం ముగ్గుల పోటీలను క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపాజ్వాల నరసింహారావు ప్రారంభించారు. పలు గ్రామాల్లో ముగ్గులు పోటీలు నిర్వహించారు.

మండలంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను సంక్రాంతి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ముంగిళ్ళలో ముగ్గులు వేసి గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ వేడుకల్లో భాగంగా మాదల, కుందురువారిపాలెం, చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లో నిర్వహించిన ఆటల పోటీలలోని విజేతలకు బహుమతులు అందించారు. బుధవారం కనుమ పండగను జరుపుకున్నారు.



సత్తెనపల్లిలో ఇంటి ముందు రంగవల్లులు వేస్తున్న మహిళ



మల్లాదిలో ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న వెంపాజ్వాల నరసింహారావు



పెదకూరపాడులో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



రాజుపాలెం వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



మహిళల కోలాటంతో స్వామి వార్ల గ్రామోత్సవం

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెంలో వేంచేసి ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. వేద పండితులు వికాస్ మిస్రా, రామానుజాచార్యులు వేద మంత్రాలతో, మంగళవాయిద్యాల మధ్య కల్యాణం నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తలు పొత్తూరి సుబ్బారావు, వెంకటరమణ దంపతులు కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణంలో సుమారు 30 మంది దంపతులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రామానుజాచార్యులు కల్యాణం నిర్వహించిన దంపతులకు, భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం మహిళల కోలాటంతో స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు నీళ్ల వారులు పోసి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం చింతామణి నాటక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో ముగ్గుల పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 50 మంది మహిళలు పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. ఐదుగురికి నగదు బహుమతులను అందించారు.

వైష్ణవ ఆలయాల్లో స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు



క్రోసూరు: సంక్రాంతి పండగ పురస్కరించుకుని మండలంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు, గ్రామోత్సవాలు మంగళవారం సాయంత్రం నిర్వహించారు. క్రోసూరులోని వేణుగోపాలస్వామి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అనంతవరంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో కల్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రోసూరులోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామి వారి శాంతి కల్యాణం, గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

దేవుని చేతిలో బలంగా వాడబడాలి

దాచేపల్లి: యువత బలవంతుని చేతిలో బాణమువంటి వారని, దేవుని చేతిలో బలంగా వాడబడాలని ఏఈఎల్‌సీ యూత్ డైరెక్టర్ రెవ.డాక్టర్ గనుపల్లి సతీష్‌బాబు అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో పల్నాడు జిల్లాస్థాయి యువకుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. వివిధ సంఘాల నుంచి వచ్చిన యువకులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. బైబిల్‌లోని దానియేలు గ్రంథంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం వ్యాచరచన పోటీలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి సతీష్‌బాబు మాట్లాడారు. స్థానిక సంఘ కాపరి రెవ. జీఎస్‌పీ. కుమార్, కౌన్సిల్ మెంబర్ మాచర్ల మోజెస్, డేలిగేట్స్ వినుకొండ బాబు, శ్రీపతి కాశయ్య పలువురు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ



మాచర్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, లవ్ అండ్ ఆఫ్ ఆనందవిహారి గ్రూప్, పల్స్ పోలియో ప్రోగ్రాం గ్రూప్ అందరూ కలిసి సమాజానికి దూరంగా జీవిస్తూ, బడుగు వర్గాలుగా ఉన్న శరీన్ (లెప్రసీ) కాలనీలో గల కుటుంబ సభ్యులందరికీ అందరికీ 300 కిలోల బియ్యం, 50 కిలోల కందిపప్పు అందించడం జరిగింది. సమాజంలోని అన్ని వర్గాలతో పాటుగా వీరు ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొండవీటి కృష్ణ కుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, డెప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్, వీరికి నిత్యవసర సరుకులను అందించడం జరిగింది. కార్యక్రమంలో తుమ్మల సత్య ప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు నాగార్జున రెడ్డి, సాంబశివరావు, మస్తాన్ వలి, అడ్మిన్ డైరెక్టర్ పఠాన్ నాగూర్ వలి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి



మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి నూతనంగా సమన్వయకర్తగా నియమితులైన అనంతరం ఆయన నియోజకవర్గంలోని సీనియర్ నాయకులను మర్యాద పూర్వకంగా మంగళ, బుధవారాల్లో కలిశారు. దీనిలో భాగంగా సత్తెనపల్లి మాజీ శాసన సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ నాయకుడు పక్కాల సూరిబాబు, మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, డాక్టర్ ఎస్.రాజమోహన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. ఓ వైపు సంక్షేమం .. మరోవైపు అభివృద్ధి చేపట్టారన్నారు. నియోజకవర్గంలోని పట్టణంతో పాటు అన్ని మండలాల్లో గ్రామ/వార్డు స్థాయి నుంచి పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని, అందరి సలహాలు, సూచనలు స్వీకరించి పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరితో కలిసి అడుగులు ముందుకు వేస్తానన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

మాజీ ఎమ్మెల్యే నంబూరు కార్యాలయంపై దాడి దారుణం

అచ్చంపేట జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి



అచ్చంపేట: మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అని జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఆరు నెలల కాలంలోనే వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. ప్రశాంతంగా ఉండే నియోజకవర్గాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు కూడా దళిత వాడలపై దాడులు నిర్వహించి హింసించిన విషయం, ఆ తరువాత జరిగిన మరికొన్ని ఘటనలను ఆయన గుర్తు చేశారు. దాడులు చేయడం, వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను హింసించడం చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. ఆటవిక పాలనలో ఉన్నామా అనే సందేహం కలుగుతుందన్నారు.

రేపు తురకపాలెం చర్చి 122వ వార్షిక తిరునాళ్ల



విద్యుత్ వెలుగుల్లో పునీత అంతోని దేవాలయం

తురకపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం గ్రామంలోని పునీత పాదువాపురి అంతోని దేవాలయ 122వ వార్షిక తిరునాళ్ల ఈ నెల 17వ తేదీన జరుగుతుందని చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ నాగోతు చిన్నయ్య బుధవారం తెలిపారు. దాదాపు 122 సంవత్సరాల చరిత్ర గల ఈ చర్చి వార్షిక తిరునాళ్లను ప్రతి ఏడాది జనవరి 17న నిర్వహించటం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా ఆలయ ఆవరణలో మట్టితో నిర్మించిన లూర్ధుమేరిమాత విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం గ్రామంలో తేరు ప్రదక్షిణ జరుగుతుందన్నారు.

జేసుతిరు హృదయ స్వరూప ప్రతిష్ట నేడు

పునీత అంతోని చర్చి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 16వ తేదీన 25 అడుగుల ఎత్తైన జేసుతిరు హృదయ స్వరూప ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు మద్దినేని శౌరయ్య, సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్ ప్రతాప్‌లు తెలిపారు. గ్రామ ప్రారంభంలో గల ప్రదేశంలో ఉదయం 8.30 గంటలకు స్వరూప ప్రతిష్ట, ఆశీర్వాద పూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి గుంటూరు బిషప్ చిన్నాబత్తిన బాగ్యయ్య, విజయవాడ బిషప్ తెలగతోటి రాజారావులు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు పంపిణీ



బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నకరికల్లు: సంక్రాంతి పురస్కరించుకొని మండలంలోని నర్సింగపాడు గ్రామంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు ఘనంగా ముగిశాయి. నకరికల్లు, రాజుపాలెం రెండు మండలాల స్థాయిలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో 30 జట్ల క్రీడాకారులు తలపడ్డారు. ఆరురోజుల పాటు నిర్వహించిన పోటీలలో విజేతలకు మంగళవారం బహుమతులు పంపిణీ చేశారు. ఓవరాల్ విజేతగా ఇనిమెట్లకు చెందిన నూర్‌బాషా సిద్దయ్య, నూర్‌బాషా ఫాజిల్‌లు నిలవగా రూ.10 వేల నగదు బహుమతిని మారం రామలక్ష్మి /ాపకార్థం అందజేశారు. ద్వితీయ స్థానంలో నర్సింగపాడు గ్రామానికి చెందిన పోతులూరి కాశీచారి, సునీల్ నిలవగా రూ.7 వేల బహుమతిని ఏ.ఆర్.మిల్క్‌ప్రొడక్ట్స్ వారు అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన ఇనిమెట్ల గ్రామానికి చెందిన షేక్ మహ్మద్‌జానీ, షేక్ మస్తాన్‌వలి రూ.5 వేల బహుమతిని ఎస్.ఎస్.పి.యూత్ వారు అందజేశారు. నాలుగో స్థానంలో నర్సింగపాడు గ్రామానికి చెందిన శ్రీను, ఖాదర్‌లు నిలవగా రూ.3 వేల బహుమతిని ఎస్.ఎస్.పి. యూత్ వారు అందజేశారు. క్రీడాకారులను గ్రామస్తులు అభినందించారు.

కర్పూర మకర జ్యోతిని దర్శించుకున్న భక్తులు



గీతా మందిరం వద్ద కర్పూర మకర జ్యోతి

అమరావతి: పుణ్యక్షేత్రమైన అమరావతి గీతామందిరం వద్ద మంగళవారం రాత్రి మకర సంక్రాంతి సందర్భంగా హరిహర సుతుడైన అయ్యప్పస్వామి కర్పూర మకర జ్యోతిని భక్తులు దర్శించుకున్నారు. తొలుత అయ్యప్పస్వామి చిత్రపటాలను ఊరేగించి అనంతరం రంగు, రంగుల పువ్వులతో అలంకరించిన ప్రత్యేక వేదిక పైన కర్పూర దీపాన్ని వెలిగించారు. ఈ కర్పూర మకర జ్యోతిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల శరణఘోషతో హనుమత్ గీతా మందిరం ప్రతిధ్వనించింది. సుమారు 40 ఏళ్ళ క్రితం అమరావతిలో మొదటిసారిగా అయ్యప్పమాల ధరించిన కీ.శే.మద్ది కామయ్య ప్రారంభించిన ఈ జ్యోతి ప్రజ్వలన కొనసాగిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది 25 కేజీల కర్పూరంతో కర్పూర మకర జ్యోతిని వెలిగించామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి మహిళా మండలి, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రెంటచింతల: మండలంలోని తుమృకోట గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నల్లబోతుల రిషివర్ధన్, తోట లింగయ్య, షేక్ బాబర్‌వలి, షేక్ రహమాన్‌లు రెండు ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా వేగంగా వస్తూ బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలుకాగా వారిని వెంటనే మాచర్ల ఓ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. తోట లింగయ్యకు బలమైన గాయాలు కావడతో అతనిని ఐసీయూలో చేర్పించారు.